# ఖూనీ డే

ఆవేళ ఆదివారం -

ప్రభుత్వోద్యోగులంతా ఆదివారాలు హాయిగా ఇంట్లో గడపడం పరిపాటి -

అయితే - ఆ రెవెన్యూ కార్యాలయం మాత్రం రోజుకంటే హడావిడిగా వుంది. గుమాస్తాలంతా ఒక్కరు కూడా గైరుహాజరు కాకుండా ఆఫీసుకు వచ్చేశారు. అలా రాకపోతే ఆఫీసరు గారి కోపాగ్నికి ఆహుతైపోతామని అందరికీ తెలుసు!

ఒక్క ఆదివారాలే కాదు - రెండో శనివారాలూ, పండగలూ, పబ్బాలూ... ఏ సెలవు రోజునైనా ఎవ్వరూ రానని అనడానికి వీల్లేదు!

మరుసటిరోజున పబ్లిక్‌హాలిడే ఉన్నదీ అనగానే ఆఫీసరుగారి వద్దనుంచి మూరెడు పొడవున్న 'సర్క్యులర్' వచ్చేస్తుంది. ఏమనీ - ఆ మరుసటి రోజున ఫలానా రిపోర్టు పంపించాలనో, ఫలానా ఫలానా పర్టిక్యులర్స్ హెడ్ ఆఫీసువాళ్లు అడుగుతున్నారనో... కాబట్టి ఆఫీసు స్టాఫ్ అంతా వచ్చి తీరాలని ఆ 'సర్క్యులర్'లో ఉంటుంది. అంతే - చచ్చినట్టు అందరూ వచ్చి తీరుతారు. ఏ సెలవుదినానైనా పనిచేయడం అలవాటయింది వాళ్లకి. అయితే - ఆఫీసరుగారి కోపాలకీ, తిట్లకీ, కేకలకీ, సుప్రభాతాలకీ అలవాటు పడలేకపోతున్నారు వాళ్లు!

"ఆనందరావ్! నిన్ను ఆఫీసరు పిలుస్తున్నారు!" అంటూ అప్పుడే ఆఫీసరు గదిలోంచి హెడ్‌క్లర్క్ వచ్చి చెప్పాడు.

"ఏం సార్!" పక్కనే పిడుగుపడ్డట్టు ఉలిక్కిపడి బిత్తర చూపులు చూస్తూ కీచుకంఠంతో అన్నాడు - అలా 'కీచు' భయంతో వున్నప్పుడే ధ్వనిస్తుంది అతనిలో!

"ఏం లేదూ... నీ 12/90 ఫైలును తీసుకొని రమ్మన్నారు - త్వరగా వెళ్ళు!" అనేసి వెళ్ళిపోయాడు హెడ్‌క్లర్క్. తక్కిన గుమాస్తాలంతా ఓసారి చూశారు ఆనందరావు వేపు - కసాయివాడి వద్దకు పోబోతున్న గొర్రెపిల్లని చూసినట్టు.

ఆనందరావు ఆత్రంగా బీరువాలోని ఫైళ్లని టకటక తిరగేసి 12/90 ఫైలును తీసుకొని గుండెల్ని అరచేతిలో ఉంచుకుని మెల్లగా ఆఫీసరు గదిలోకి వెళ్లాడు.

ఆఫీసరుగారు లావుగా, ఎర్రగా ఉన్నాడు. పల్చగా వంకీలు తిరిగిన జుట్టు, అక్కడక్కడ నెరసిపోయి వుంది. కర్కశమైన చూపులు కురిపించే పెద్దపెద్ద కనుగుడ్లకు రోల్డుగోల్డు ఫ్రేమ్ అద్దాలున్నాయి. హనుమంతుడికి వారసుడిలా ముందుకొచ్చిన లావు పెదవులున్న పేడిమూతి వుంది.

ఆనందరావు ఆఫీసరుగారి టేబుల్ ముందు ఉరిశిక్ష వేసిన ఖైదీలా నిల్చున్నాడు.

ఆఫీసరుగారు ఎవర్నీ కూచోమనరు - తన కంటే పెద్ద ఆఫీసరు వస్తే తప్ప. అయితే నెలలో ఒకేఒక్క రోజున తన ఎదురుగా కూచోనిస్తాడు - అదే రోజున అంటే - "స్టాఫు మీటింగ్" జరిగే రోజున మాత్రమే!

"ఏమిటి అలా గుడ్లప్పగించి చూస్తున్నావ్? 12/90 ఫైలు తెచ్చావా?" ఉరిమాడు ఆఫీసరు.

"తెచ్చాను సార్.. ఇదిగో..." అంటూ ఫైల్ని వణుకుతున్న చేతుల్తో అందించాడు ఆనందరావు.

"నిన్న వచ్చిన లెటరుకు ఇంకా సమాధానం రాయలేదు. ఏం చేస్తున్నారండీ! నిద్రబోతున్నారా! ఆఫీసులో ఆఁ..." అంటూ గర్జించారు ఆఫీసరు. ఆఫీసరుగారు ఎప్పుడు ఏకవచనంతో సంబోధిస్తారో, ఎప్పుడు బహువచనం ప్రయోగిస్తారో తెలీదు.

మౌనంగా ఉండిపోయాడు ఆనందరావు - ఏమి మాట్లాడినా కష్టమేనని.

'ఏం - మాట్లాడవు? ఎవడు నీకు ఉద్యోగం ఇచ్చింది... ఓనమాలు రానివాళ్లకి ఉద్యోగాలు యిస్తే... ఇట్లా వుంటుంది ఏడుపు. నేను వచ్చిన దగ్గర్నించి చూస్తున్నా ఏ రోజునైనా కరెక్ట్‌గా ఫైళ్లు పుటప్ చేస్తున్నావా? ఈ ఆఫీసులో అందరూ అందరే - తిండికి తిమ్మరాయుళ్లు, పనికి బండరాయుళ్లూ - ఎందుకండీ ఇంత దరిద్రంగా ఉద్యోగాలు చేస్తారు - రాజీనామాలు చేసిపోండి - ఉద్యోగాలు ఇష్టం లేకపోతే - ఏ ఒక్క రోజయినా ఏం పనిచేస్తున్నారు? మీకు ఒక్క రోజుకు గవర్నమెంటు ఎంత 'పే' చేస్తోందో తెలుసా - దాదాపు 80 రూపాయలు - ఏ రిక్షావాడో, కట్టెలు కొట్టేవాడో పగలంతా పనిచేస్తే వాడికి 20 రూపాయలు గిట్టవు - ఆఫీసులో పంకాలకింద పనీపాటా లేకుండా కుర్చీలలో నిద్రబోయే మీలాంటి రకాలకి 80 రూపాయలు, పైగా ఏదో కుళ్లబొడిచేస్తారని సంవత్సరానికోమారు ఇంక్రిమెంట్లూ, రెండుమార్లు డిఏలూ... ఇక్కడేదో పెద్ద వర్కు వెలగబెట్టామని లీవులు పెట్టడం ఒకటీ... పైగా లీవులు కావాలంటే ఇంటి దగ్గర్నించే తమ్ముళ్లతోనూ, బావమరుదులతోనూ లీవు లెటర్స్ పంపడం... ఇక్కడ ఆఫీసరు వెధవ వకడు ఉన్నాడుగా తేరగా, సెలవులివ్వక ఏం జేస్తాడు అని మీ ధీమా!... రాస్కెల్స్..." ఇలా తిట్ల దండకం కొనసాగుతోంది.

అంతకుముందు రోజు ఆనందరావు వంట్లో బాగోలేక వాళ్ల తమ్ముడితో లీవులెటరు ఇచ్చి పంపాడు. ఆ కోపాన్ని తీర్చుకునే ప్రయత్నమే ఇదంతా అని ఆనందరావుకి అర్థమయిపోయింది. అన్నీ సహనంగా వింటున్నాడు. ఎదురు తిరిగి అతని నోరు

మూయించాలని వుంది. అప్పటికీ మూయకపోతే గొంతు పిసికేయాలన్నంత కోపం కడుపులోంచి తన్నుకు వస్తోంది.

సరిగ్గా ఆ క్షణంలోనే ఆనందరావులోని మహానటుడు బయటికి వచ్చి తనలోని ఆవేశాన్నీ కోపాన్నీ కప్పిపుచ్చి ఏమీ ఎరగనివాడికి మల్లే, అసలా మాటలే వినని వాడికి మల్లే అమాయకంగా చూస్తూ ఉన్నాడు.

పది నిమిషాలు దండకం చదివాక... "మిమ్మల్ని ఎంత అన్నా ఒక్కటే... మనిషికో మాటా, గొడ్డుకో వేటూ... మీరు మనుషులయితే కదా... మిమ్మల్ని అనడంకంటే గోడకేసి తల బాదుకోవడం మేలు..." అన్నాడు ఆఫీసరు ఉపసంహారంగా.

అయినా ఆనందరావులోని మహానటుడు హాయిగా వింటూ అమాయకంగా చూస్తూనే ఉన్నాడు.

"ఇక వెళ్లు... నీ మొహం చూస్తుంటే నాకు ఏవగింపు పుడుతోంది..." అంటూ ఆనందరావు వేపు ఫైలు విసిరాడు ఆఫీసరు.

ఆనందరావులోని మహానటుడు నటన మరిచిపోతున్న క్షణంలో ఫైలు తీసుకుని అక్కడినుంచి కదిలాడు.

ఆ ఆఫీసులో ప్రతి గుమాస్తా ఆఫీసరు బాధితుడే! ప్రతిరోజూ అందరూ ఏదోఒక సమయంలో సుప్రభాతాలో, స్తోత్రాలో, దండకాలో ఆఫీసరుతో చదివించుకొనేవాళ్ళే!!

ప్రతి వ్యక్తికీ 'ఖూనీ' చేయాల్సిన లిస్టు ఒకటి వుంటుందంటారు - అలా వుండిన పక్షంలో ఆ ఆఫీసులోని గుమాస్తాల ఖూనీ లిస్టుల్లో మొదటి వ్యక్తి ఆఫీసరే!

❁ ❁ ❁ ❁

రాత్రి ఎనిమిది గంటలయింది-

సావిత్రి పిల్లలిద్దర్నీ నిద్రపుచ్చి బయటి అరుగుమీద భర్తకోసం ఎదురుతెన్నులు చూస్తూ కూచుంది. మామూలుగా భర్త ఆ వేళకే రాడని తెలుసు. అయినా అట్లా ఎదురు చూడటం ఆమెకు అలవాటయిపోయింది.

వీధి మొగదలలో ఏ మోటరుబైకు వచ్చినా తన భర్తేనని లేచి నుంచుంటుంది.

ఆమె భర్త సత్యనారాయణ - ఎక్సైజు డిపార్టుమెంటులో ఉద్యోగం. అతనికి ఉద్యోగమంటే 'పంచ' ప్రాణాలు. ఇక ఆరో ప్రాణం పేకాట! మరి ఏడో ప్రాణం 'మందు'... ఎనిమిదో ప్రాణం అన్నది ఇంకా ఏదీ అలవాటు కాకపోవడం సావిత్రికి అరకొరగా తృప్తిని కలిగించే విషయం!

ఎదురింట్లో గడియారం 10 గంటలు కొట్టింది. పెద్దశబ్దం చేస్తూ మోటారుబైకు వచ్చి ఇంటిముందు ఆగింది. హుందాగా సత్యనారాయణ దిగాడు.

'అమ్మయ్య' వచ్చేశాడు అని అనుకోవడమే గానీ సంతోషపడదు సావిత్రి. అతను వచ్చేవరకూ రాలేదేమా అని ఎదురుచూస్తుంది. తీరా వచ్చాక 'ఎందుకొచ్చాడా?' అని ఆందోళన పడుతుంది. ఆమె ఆందోళనకు కారణం - అతని ప్రవర్తనే!

"నీకు ఎన్నిసార్లు చెప్పాను. ఇలా అరుగుమీద కూచోవద్దనీ - అందరికీ తెలియాలా నేను ఇంట్లో లేనని - బుద్ధి లేకపోతే సరి..." అంటూ తన సహజధోరణిలోనే పెద్దగా గొణుగుతూ ఇంట్లోకి అడుగుపెట్టాడు సత్యనారాయణ.

ఆమె ఏమీ వినిపించుకోనిదానికిమల్లే అతనికి లుంగీ, టవలూ తెచ్చియిచ్చింది. అతని నోటినుంచి వస్తోన్న బ్రాందీ పరిమళం ఆమె నాసికను 'గుప్'మని తాకింది.

"పిల్లలు నిద్రబోయారా?"

"ఊఁ"

"ఏం అలా వున్నావ్ - మొహమంతా మాడ్చుకుంటూ... ఛీఛీ... పాడు మొహందానా... నీ మొహం చూస్తేనే అష్టదరిద్రాలూ అంటుకుంటాయి" అంటూ గొణుగుతూనే లుంగీ అందుకుని బట్టలు మార్చుకుని, టవల్ బుజాన వేసుకుని బాత్‌రూంలోకి వెళ్లాడు.

"ఏయ్! ఏమే సావీ! ఇంట్లో సబ్బుముక్కగూడా లేదా? ఇది ఇల్లా వల్లకాడా..." అంటూ కేకలేస్తూనే ఉత్తనీళ్లతోనే మొహం కడుక్కుని వచ్చాడు.

"సాయంత్రం అయిపోయింది... తెప్పిద్దామా అంటే ఎవరికి చెప్పాలా అని ఊరుకున్నా..." అంది సావిత్రి మెల్లగా.

"ఏం నువ్వెళ్లి తేకూడదూ? నువ్వేం మహారాణివా? రాత్రికి ఎప్పుడో వస్తాడుగా - వాడే వచ్చి తెచ్చి ఛస్తాడులే అనుకున్నావా దరిద్రపు ముండా!"

సావిత్రికి ఇవన్నీ మామూలు అయిపోయాయి. అందుకే మౌనంగా వెళ్లి భోజనం వడ్డించింది.

"ఏంకూర?" అన్నాడు గొంతులో కఠినత్వం ఏమాత్రం తగ్గకుండా.

"మీకిష్టమని గుత్తి వంకాయకూర వండాను"

"గుత్తి వంకాయ పేద్దకూరనుకున్నావా? ఏ చికెన్ రోస్టో, మటన్ ఫ్రయ్యో చేసినదాన్లా మాట్లాడుతున్నావ్?

"మీరు తెచ్చియిస్తే వండనా?"

"ఛ నోర్మూయ్! - అన్నీ నీకు నేను తెచ్చియివ్వాలా? నేను చేస్తోంది గవర్నమెంటు వుద్యోగం... నీలాగా ఇంట్లో అంట్లు తోమడం - పిల్లల ముడ్లు కడగడం కాదు. ఆ మాత్రం తెచ్చుకోవడం చాతకాకపోతే ఎందుకు నువ్వు!"

సావిత్రిలో రోషం తలెత్తింది - కళ్లలో నాగుపాములు బుసకొడుతున్నాయి.

అతడు ఆమెను చూడలేదు కాబట్టి సరిపోయింది. లేకుంటే ఏమయ్యేదో!

కంచం ముందు కూచున్నాడు-

వంకాయను ఒక్క ముక్క తుంచి నోట్లో వేసుకున్నాడు. మొహమంతా చిట్లించాడు.

సావిత్రి గుండెలు దడదడలాడాయి-

"ఇది గుత్తివంకాయా? థూ... నీ పాడుమొహానికి వండటం కూడా రాదు" అంటూ కంచాన్ని విసరికొట్టాడు. వేగంగా ఎదురుగా వున్న గోడకు తగిలి పెద్దచప్పుడు చేస్తూ కిందపడింది కంచం. గదంతా చెల్లాచెదురుగా అన్నం మెతుకులు పడ్డాయి. అల్లంత దూరంలో దీనంగా గుత్తొంకాయలు...

సావిత్రి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

"మీ కిష్టం లేకపోతే తినకండీ... అంతేకానీ ఇలా..."

"నాయిష్టం... ఏమే బాగా తిని కొవ్వెక్కిందా నన్నే అనేదానివయ్యావా? తప్పుడు ముండా!" అంటూ సావిత్రి కొప్పు పట్టుకొని మూతిమీద అరచేత్తో ఒక్క చరుపు చరిచాడు. పెదాలు చిట్లి రక్తం వస్తోంది! పట్టుకున్న కొప్పును ఊరికే వదలాలనిపించలేదతనికి గోడకేసి బలంగా తోశాడు. గోడకు 'ధన్'మంటూ కొట్టుకుంది. అంత జరిగినా నిశ్శబ్దంగా రోదిస్తోంది సావిత్రి. పక్కనే వున్న కత్తిపీటతో అతన్ని నరికేయాలన్నంత కోపం వచ్చేసింది అయినా – ఆమె నిస్సహాయురాలు.

❀ ❀ ❀ ❀

వాచీ చూసుకున్నాడు శంకరం. మూడున్నర అయింది. ఆకాశం వంక చూశాడు – మబ్బులు దట్టంగా వుండటంవల్ల సూర్యుడెక్కడ వున్నాడో తెలియలేదు.

ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్ ముందున్న సిమెంటు బెంచీ మీద కూచుని ఉన్నాడు శంకరం. అప్పటికి మూడు రోజులయింది అతను ఆ ఊరు వచ్చి. జేబులో డబ్బులు అయిపోయాయి. గెస్ట్‌హౌస్‌లో దిగిన ఎమ్మెల్యే తనని నాలుగు గంటలకి కలవమన్నాడు.

శంకరానికి 34 ఏళ్ళు శరీరంపై ముసురుకొంటున్నా అతని ఎమ్‌ఏ చదువు ఉద్యోగాన్ని ఇప్పించలేకపోయింది. ఇలా వట్టి డిగ్రీలూ, తెలివితేటలూ ఉద్యోగానికి తగిన అర్హతలు కావని తెలిసి, స్థానిక ఎమ్ఎల్ఏ సిఫార్సుతో ఉద్యోగం సంపాదించవచ్చునని ఎవరో చెబితే గత నెలరోజులుగా ఎమ్మెల్యే వెంబడి తిరుగుతున్నాడు. అప్పటికే ఐదువేల రూపాయలు అప్పుచేశాడు. 'స్పెషల్ టీచర్ పోస్టుకు ఇరవై వేలు అడుగుతున్నారు. మనకు కాబట్టి పదివేల రూపాయలకే ఇస్తారు' అని ఎమ్మెల్యే అనడంతో – ఊరిబయట వున్న ఐదుసెంట్ల ఇంటిస్థలం అమ్మేసి తెచ్చిఇచ్చాడు.

నాలుగు అవుతున్నట్టే గెస్ట్‌హౌస్‌లోకి దారితీశాడు శంకరం–

ఎమ్మెల్యే హాయిగా కింగ్‌సైజు సిగరెట్టు తాగుతూ వరండాలో ఎవరితోనో మాట్లాడుతున్నాడు. శంకరాన్ని చూడగానే ఇబ్బందిగా మొహంపెట్టి – "ఏం బాబూ నాలుగు గంటలకి కదా నిన్ను రమ్మన్నది..." అంటూ వాచీ చూసుకుని – "అరెరె నాలుగయ్యింది – అందుకే వచ్చావు" అన్నాడు.

"అవును సార్!" శంకరం.

"అవునూ నువ్వు స్పెషల్ టీచర్ పోస్టుకు కదా ఎగ్జామ్స్ రాసినదీ... బాగా రాశావా?" అన్నాడు ఎమ్మెల్యే, శంకరాన్ని ఆ ప్రశ్న వేయడం ఏ పదివేలసార్లో!

"అవును సార్!" అన్నాడు కాస్త అసహనంగా శంకరం.

"ఈ పోస్టులు భర్తీ చేయడంలో ఏదో కుంభకోణం ఉన్నట్టుందయ్యా! లేకపోతే నీలాంటి తెలివయిన కుర్రాడికి ఇవ్వడం లేదంటే..."

"ఏం సార్ నాకా పోస్టురాదా?" ఆత్రంగా శంకరం.

"అదీ... రాదనే నా అనుమానం... నేను నువ్విచ్చిన డబ్బుకూడా వాళ్లకి ముట్టజెప్పాను. అయినా వచ్చేట్టులేదు – ఇప్పుడే ఫోన్ చేసి కనుక్కున్నా–"

"మరి నా డబ్బో..." అన్నాడు దీనంగా శంకరం.

"నీ డబ్బు ఎక్కడికీ పోదులేవయ్యా... ఈ పొద్దు కాకపోతే రేపొస్తుంది"

"మీరు నా అవస్థలు చూస్తున్నారు... ఇంటి స్థలం అమ్మిన డబ్బుసార్ అదీ..."

"సరే లేవయ్యా... మరో ఉద్యోగం చూద్దాంలే"

"మీరు కడుపు నిండినవాళ్ళు సార్! నా పరిస్థితి అర్థం చేసుకోలేరు" అన్నాడు శంకరం – కొంచెం ఘాటుగానే–

"ఇంతకీ ఏమంటావ్! నేను తిన్నానా ఆ డబ్బు. ఏదో కుర్రాడివీ, తెలివయినవాడివీ అని ఉన్న విషయం చెబుతుంటే"

"నా డబ్బు నాకు ఇప్పించండి సార్! ఇటు ఉద్యోగం రాక– అటు డబ్బూ పోతే..."

"నీ డబ్బు నేను తిన్నానా అలా మాట్లాడుతావ్! ఉద్యోగం నా జేబులో ఉందా నీకు తీసివ్వడానికి" అన్నాడు ఎమ్మెల్యే సీరియస్‌గా.

ఎమ్మెల్యే ఎందుకలా సీరియస్ అయిపోతున్నాడో శంకరానికి అర్థం కావడంలేదు. అతని తీరు చూస్తోంటే మొదటికే మోసం చేసేలా వున్నాడు.

"మీ జేబులో ఉద్యోగం లేదన్న విషయం తెలుసు... అందుకే – డబ్బులిచ్చి ఇన్నాళ్ళూ తిరిగాను."

"నువ్వు నాకేం బాకీగా ఇవ్వలేదు... నీతో ఎక్కువ మాటల్తో పనిలేదు. ముందు ఇక్కణ్ణించీ వెళ్లిపో! ఏదో మీనాన్న నాకు బాగా పరిచయస్తుడనీ ఇంతకాలం నిన్ను పలకరించా... ఆడబ్బు మీనాన్నకే ఇస్తాను పో!"

"నేను పోను... నా డబ్బు ఇచ్చేవరకూ" అంటూ మొండికేశాడు శంకరం.

"ఏమిరా... మర్యాదగా చెబుతుంటే కదలవా? అరేయ్! వీణ్ణి బయటికి నెట్టండ్రా! ఏంజేస్తాడో–" అంటూ నౌకర్లకి పురమాయించాడు ఎమ్మెల్యే.

శంకరం కళ్లల్లో నీళ్లు తిరిగాయి. తనవద్ద ఉన్న పెన్నే 'గన్ను' అయివుంటే ఆ రాజకీయ నాయకుడి శరీరాన్ని జల్లెడగా మారేట్లు కాల్చేసి వుండును!

❁ ❁ ❁ ❁

కొత్త ఢిల్లీలోని ఓ మీటింగుహాలులో "ప్రపంచ మానసిక శాస్త్రజ్ఞుల సదస్సు" జరుగుతోంది. వివిధ దేశాల మానసిక శాస్త్రవేత్తలంతా ఆ సమావేశంలో పాల్గొన్నారు.

వేదికమీద కెనడాకు చెందిన బెంజిమన్ అన్న శాస్త్రవేత్త ఆంగ్లంలో ఉపన్యసిస్తున్నాడు–

"ఈవాళ్టికి మన సదస్సు జరుగుతోంది ఐదవ రోజు. చాలా విషయాలు తక్కిన శాస్త్రజ్ఞులంతా మాట్లాడారు – ఆ విషయాలు మీరు ఆలోచించాలి... మనిషి చాలా రకాల రుగ్మతలకు గురి అవుతున్నట్టు మనకి తెలుసు. అందుకు తన చుట్టూ వున్న మనుషుల వాతావరణమే! సాటి మనిషిని మనిషిగా చూడక అధికారంతోనో, అహంకారంతోనో, దౌర్జన్యంతోనో వ్యవహరించడం ఒకటీ – ఎదటి మనిషిని వీలయినంతవరకూ దోచుకోవడం ఒకటి... ఇవన్నీ కూడా మనిషిలోని కసినీ, ద్వేషాన్నీ ఎక్కువ చేస్తున్నాయి. అవి మనసులోనే అణిగిపోయి వుండడంవల్ల రకరకాల మానసిక వ్యాధులకు గురి చేస్తున్నాయి.

మనిషిలోని కసీ, ద్వేషం మటుమాయం కావాలంటే వాటిని మనసులోంచి బయటికి పంపించి వేయాలి. అదెలా??? అది 'హింసాదినం' నుంచే సాధ్యం. కాబట్టి ఈనాడు 'హింసాదినం' అన్నది ప్రపంచానికి అత్యవసరం. ఈ విషయమై ప్రపంచంలోని అన్నిదేశాల ప్రభుత్వాలతోనూ మేము సంప్రతించాం. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఆయా ప్రభుత్వాలు 'హింసాదినా'న్ని అంగీకరించాయి!

వచ్చేనెల - అంటే ఆగస్టు 1వ తేదీన ఈ 'హింసాదినం' అమలు జరుగుతుంది. ఆ రోజున ఉదయం ఆరుగంటలనుండీ సాయంత్రం ఆరుగంటల వరకూ ఎవరు ఎంత హింస చేసినా నేరంగా పరిగణించరు. శిక్ష కూడా వేయరు... అసలు ఆరోజు నేరాలని పోలీసులు కేసులుగా నమోదు చేయరు - కోర్టులు తీర్పుచెప్పవు..." అంటూ బెంజమన్ అనర్గళంగా ప్రసంగిస్తోంటే - కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

'హింసాదినం - అనివార్యం' అంటూ పెద్దపెట్టునా నినాదాలు...

ప్రపంచమంతా రేడియోలలోనూ, టెలివిజన్లలోనూ, పత్రికలలోనూ 'హింసాదినం' గురించి బాగా ప్రచారం జరిగింది.

ప్రపంచంలోని ఎందరో ఆనందరావులూ, సావిత్రులూ, శంకరాలూ, ఇంకెందరో పతితులూ, బాధాసర్పదష్టులూ నల్లత్రాచుల్లా బుసలు కొట్టారు.

'హింసాదినం' రానే వచ్చింది-

గుమాస్తాలందరూ ఆఫీసర్ల తలల్ని నరికేశారు...

సావిత్రులందరూ సత్యనారాయణల గుండెల్లో బాకుల్ని దించేశారు-

శంకరాలు అందరూ రాజకీయ నాయకుల శరీరాల్ని గన్నులతో జల్లెడలుగా మార్చేశారు -

ఇంకా ఎందరెందరో లాకప్పులలో రేప్‌లయిన వారూ, భూస్వాముల దోపిడీకి గురయినవారూ... అందరూ 'హింసాదినా'న్ని ఘనంగా జరిపారు-

❁ ❁ ❁ ❁

తూరుపు ఎర్రబారింది -

అధికారం, అహంకారం, దౌర్జన్యం, దోపిడీ, క్రౌర్యాలు లేని కొత్త సూర్యోదయం ఆవేళ-

• ఈనాడు - ఆదివారం - **31.3.1991** •